# వేంకటనాధుని పెండ్లి

## (నిర్వచన కధనము)



**రచన :**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech



## ముందుమాట

రామాయణ కాలంనాటి సత్య సంధుడు రామయ్య కథే రకరకాలుగా మారింది. మరి కలికాలంనాటి కళ్యాణ చక్రవర్తి కథ రకరకాలు కాదా? నేను ఆ స్వామి కళ్యాణ కథను, నేను చదివి తెలుసుకున్న రీతిగా, తేటగీతి పద్యాలలో వ్రాశాను. ఈరోజుల్లో పెద్ద సమయం వెచ్చించి పెద్ద పద్య కావ్యాలను వ్రాయగలిగిన వారు సంఖ్యలో స్వల్పం. వ్రాసినా చదివి అర్ధం చేసుకునే ప్రయత్నం చేసేవారు అత్యల్పం. అందుకనే ఇది ఉద్గ్రంధం కాదు, 'ఉత్త గ్రంధం'. పరమాత్మను కొలిచే పరిపరి విధాలలో నేను ఎన్నుకొన్న యీ మార్గం నాకు ఎంతో ఆనందాన్నిస్తోంది. నా ప్రియదైవం కళ్యాణం చాలాసార్లు చేయించాను, చూశాను. నాకంటె చాలా ఎక్కువ సార్లు చేయించినవారు ఎందరో లెక్కలేదు. కానీ ఇలా ఆ స్వామి పెండ్లి గూర్చి నిర్వచన గాధ వ్రాసినవారు మాత్రం తక్కువే. నాకీ శక్తినిచ్చిన ఆ నిత్య పెండ్లికుమారుని శ్రీరామునిగా భావిస్తూ ఆయనకు ఇది పెండ్లికానుకగా అర్పిస్తున్నాను.



## ప్రార్ధన

తే॥ శ్రీకి దూరమై చింతించె శ్రీధరుండు
శ్రీని కోరుచు నరులెల్ల చింత విడరు
శ్రీసతియు భర్తపైగల చెలిమి చేత
శ్రీపతికి భక్తులనుగాచు చింతవలదు I

శా॥ నీతీరేమిటి నీదురూపగుణముల్
నేర్వంగమా శక్యమే
మా తోబుట్టులు, ఆలుబిడ్డలు, సిరుల్
మాకండ కాలేరయా
ఈతీరంతయు నేర్చినాను కనుకే ఏదారి
లేదందు నే
చేతుల్ మోడ్చెద శ్రీనివాస దయతో
చేయూత నాకీయవే



## వేంకటనాధుని పెండ్లి

తే॥ సూతమౌనిని చేరిరి అతని శిష్య
1 వరులు, శౌనికమునివంటివారు గురుని
**వినుడు శ్రీవేంకటేసుని ఘనచరితము**
అంచు చెప్పెను ఆ మౌని ఆదినుండి

తే॥ నారదుడు మ్రొక్కి వేడెను నలువ జేరి
2 ధరను క్షీణించు చున్నది ధర్మమంచు
**శ్రీమహావిష్ణు నెటులైన చేర్చవలెను**
**భువికి** అనిజెప్పె బ్రహ్మయు పుత్రు తోడ

**తే॥ తపము చేయరు, ధర్మము దరికి బోరు,**
**3 ధనము లేకుండె, శక్తియు తరిగియుండె,**
**భక్తి నిలువదు, మితిలేని బాధలొంద**
**హరిని చేరుట ఇంకెట్లు అవని జనులు**

తే॥ గంగతీరాన, ఋషులంత కలిసి తాము
4 యాగమొక్కటి చేయనాయత్తమైరి
నారదుండును అటకేగి చేరి యడిగె
**యాగఫలభోక్త ఎవ్వరు అనఘులార**

తే॥ వారు నారద మౌనికే బాధ్యతీయ
5 ఆ త్రిమూర్తుల శాంతుడు ఆతడెవడొ
అతనికిమ్మన, భృగుమౌని కట్టిపనిని
ఒప్పగించిరి అందరు ఒప్పుకొనుచు

తే॥ బ్రహ్మలోకమేగెను భృగుమౌని అచట
6 వాణి వీణను వినుచు తాపరవశించి
పలుకరించని బ్రహ్మను వడి శపించె
**పూజలగుగాక నీకిల ఆపూజ్యమనుచు**



తే॥ శివుడు కైలాసమందున చేరిగౌరి
7 మౌని ఏకాంత భంగము పరుప కినిసి
మునిని దూషించ, శపియించె మౌని శివుని
**లింగరూపమె పూజందు జంగమనగ**

తే॥ విష్ణు జూడ, వైకుంఠమ్ము వెడలె భృగువు
8 రమతొ సల్లాపములనాడు రమణుజూచె
స్వామి లెక్కచేయడనంచు సాకుతోడ
హృదయ భాగాన తన్నెను యెగసి కినిసి

**తే॥ తప్పుకాయుము మునివరా దయనుజూపు**
**9 నన్ను తన్నిన యెదపైన నగలజేత**
**తమరి పాదమునొచ్చెనో ఏమి జూతు**
అనుచు కూర్చొన జేసెను హరియు నతని



తే॥ కాళ్ళు పిసుకుచు పాదాన కన్ను, గాంచి,
10 చిదిమె విష్ణుడు వ్రేలితో నదిమె కన్ను,
మునియు శాంతించి క్షమవేడి మురహరుడిని
వెడలిపోయెను పొగడుచు విష్ణుఘనత

తే॥ అపుడు లక్ష్మియు అవమాన మతిశయించ
11 వీడె వైకుంఠ పురమును వెతను జెందె
విష్ణుదేవుడు పరితాప వివశుడౌచు
లక్ష్మి లక్ష్మీ యనంచును రమను వెదకె

తే॥ కుపితయై లక్ష్మి చేరెను కొల్హాపురము
12 యోగముద్రలో ధ్యానించుచుండె జనని,
వసుధ జేరెను శ్రీహరి వగచి రమకు
గడుపుచుండెను కాలము గతియు లేక



తే॥ ఆదిశేషుడు అచలమైనట్టి విధము
13 వినగ ముక్తియే కలుగును విష్ణుకృపను
ఒక్కనాడు శేషుడు తానె యుక్తుడయ్యె
వాయుదేవుని తోడను బలిమి తెలియ

తే॥ నారదుడు వారినడుమన చేరి పలికె
**14 అలరె పర్వతంబానందమనెడి దొకటి**
**దాని సాయము పొందుడు తగవు తీరు**
**కాని ఈరీతి పోరుట కాదు మేలు**

తే॥ చేరి ఆనంద నగమును వారు కోరి
15 రంత తెలుపంగ వారిలో అధికుడెవరొ
ఆదిశేషుడు బిగియించ అతని పట్టు
**గిరిని విడిపించ వాయువు గెలుచుననియె**

తే॥ బిగిసి శేషుచే వాయువు ఆగిపోయె
16 అల్లలాడిరి జనులంత అవనియందు
గాలి లేకయె, అదిచూచి కరుణతోడ
దేవవరులెల్ల అయ్యది తెలిసి చనిరి

తే॥ వారు, ఆదిశేషుని చేరి బ్రతిమిలాడి
17 వాయుదేవుని విడిపింప వలయు ననిరి
జాలిచే, పట్టు సడలించ, గాలియపుడు
పర్వతమ్మును చేసెను పలు తునకలు.

తే॥ ఒక్కదానిపై శేషుడు ఒనరియుండె
18 అదియె అతిపావనంబైన అచలమయ్యె
దాని శేషాద్రి యంచని ధరణిలోన
మునులు దానిపై జేరిరి ముక్తికొరకు



తే॥ ఇచట అవనీతలంబున చూచి వెదకి
19 అలసి శేషాద్రి చేరెను నిలువ లేక
తుదకు శోషించి పుట్టలో ఒదిగియుండె
తలచి లక్ష్మికై శ్రీహరి తపన జెందె.

తే॥ నారదుడు పోయి ఎరిగించె నలువకిద్ది
20 అతడు శివుని జేరెను చెప్పె నావివరము
హరికి సాయము చేయనై ఆ యిరువురు
లక్ష్మి కడకేగి తెల్పిరి రమణికపుడు

తే॥ పట్టు విడుపులు కలిగిన భార్య చూపు
21 కోపమగుచుండు ముచ్చట, ఆపలేని
కోపమగు వ్యధ, అందుచే కోమలాంగి!
హరికి వ్యధదీర్చ రావమ్మ త్వరితగతిని



తే॥ గొల్లభామయ్యె ఆ లక్ష్మి, గోవు బ్రహ్మ
22 అయ్యె, దూడ, శంకరుడయ్యె అందరపుడు
చోళరాజు వద్దకు చేర, చూచి అతడు
చౌకధరయంచు కొనెవాని సాకనెంచి.

తే॥ రమయు కనుమరుగయ్యెను, రాజు అతని
23 భార్యతో చెప్ప ముదమంది వాటిబెంచ
గొల్లవానికి బాధ్యత గొలుపచెప్పె,
వల్లె అని తను శేషాద్రి గొల్లదేగె

తే॥ ఆవు వడివడి పరుగిడి హరినిజేరి
24 పాలధారను పుట్టలో హరికిజేప,
త్రాగె ఆ హరి, తృప్తిగా తనకురాక
పాలు, చింతించె గొల్లడు వంతపడెను.



తే॥ కొన్ని దినములు ఇది చూచి కోపగించి
25 రాణి తిట్టగ, గొల్లడు కనెను పొంచి,
హరికి పాలిచ్చుచున్నట్టి ఆవుజూచి,
కోపమాగక కొట్టెను గొడ్డలెత్తి.

తే॥ వేటు తనతలపై బడ విష్ణుమూర్తి
26 లేచఇ నిలుచుండి ఆవును కాచెనంత
రక్త ధారను చూచి గోరక్షకుండు
మూర్ఛపడి అంధుడయ్యెనా మూర్ఖుడపుడు.

తే॥ కొండ దిగివచ్చి అరచెడి గోవు జూచి
27 రాజు ఆపద గుర్తించి రయమునేగి
ఆవు వెన్నంటి కొండపై అతడు జూచె
రుధిర ధారలు కారెడి మాధవుడిని.

తే॥ హరియు అగ్రహోదగ్రుడై అతనిజూచి
28 దాసులజ్ఞానులై చేయు తప్పులన్ని
వారి యజమాని కంటును వసుధలోన
కాన శాపార్హుడవు నీవు గొనుము దీని.

తే॥ **కలుగు పైశాచి రూపము ఖల! అనంగ**
29 కాళ్ళపైబడి వేడెను కరుణజూప
**నీవు ఆకాశరాజవ్వ నీకు దొరకు**
**తనయ పద్మావతని, యామె ననువరించు.**

తే॥ **నేను పరిణయమాడెదన్ నీదు సుతను,**
**30 అపుడు రత్న కిరీటంబు నమరజేయ**
**విడచు పైశాచరూపము నాడు నిన్ను**
అనుచు హరిజెప్పె క్షమియించి ఆతనినంత.



తే॥ అంధుడై ఏడ్చుగొల్లని అమిత కరుణ
31 బడసి, హరిఅనె నే శ్రీనివాసుడవుదు
అవతరించెద శిలరూపినౌదు నేను
కలుగు అంధత్వమును వీడగలవు నాడు

తే॥ తొలుత సనకసనందను లలిగి, హరికి,
32 ద్వార పాలురిరువురికి తాము శాప
మిడిరి **'హరివీడి' బ్రతుకులు గడుప మనిరి,**
కాళ్ళు పట్టేడ్వ చెప్పిరి కరుణ జూపి.

తే॥ శత్రులై, మీరు ముమ్మార్లు జన్మలంది
33 హరిచె చావంది చేరుదు రతని తిరిగి.
జయ విజయులును దానికి సంతసించి
జన్మలెత్తిరి దనుజులై శాపగతిని.



తే॥ ఆ హిరణ్యాక్షుడా విధి అవతరించి
34 భూమి జుట్టెను చాపలా పోయె గొనుచు
ఆ రసాతలమునకును హరియు బోయి
అయ్యె శ్వేత వరాహమ్ము అసురు జంపె.

తే॥ తనను గాచిన హరి గొల్చి ధరణి వేడె
35 తనను వాసముగా గొన ధన్యజేయ,
శేష శైలాన వసియించె శ్వేతకిటియు
గొల్చిరందరు, వకుళయు, కోర్కె దీర.

తే॥ తొల్లి ద్వాపర యుగమందు నల్లనయ్య
36 కృష్ణ నవతారమంతాన ఖిన్నులైన
యాదవుల జూచి యోదార్చి అనెను స్వామి
**కలియుగంబందు నను చేరగలరు మీరు.**



తే॥ నాడు ఆతని పెంచిన నాతియైన
37 ఆ యశోదమ్మ దరిజేరి అడిగెనిట్లు
**ఒక్క పెండ్లికిన్ పిలువవు ఓమురారి!**
**నీకు న్యాయమే తగన, నేనీకుగాన?**

తే॥ హరియు ఇట్లనె **ఓయమ్మా! అవనియందు**
**38 కలియుగంబున వకుళగా వెలయు నీదు**
**చేతిమీదుగా జరుగును శ్రీనివాసు**
**డైన నాపెళ్ళి శేషాద్రిపైన, నిజము.**

తే॥ అచట, గాయమై వెతచెందు నట్టి హరికి
39 దేవగురుడు బృహస్పతి తెలిపె, మేడి
పాలు తెచ్చి ఆ జిల్లేడు ప్రత్తి తడిపి
పట్టుగా వేయ తగ్గును, పలికి వెడలె.

తే॥ వెదుక బోయెను వాటిని విష్ణువపుడు
40 శేషశైలాన నెలకొని శ్వేతకిటిగ
వెలయుస్వామి ఆశ్రమమందు కలిసి హరియు
అడిగె నివసించు స్థలముకై ఆ విభుడిని.

తే॥ నేను సిరిలేని శ్రీపతి నిపుడు అయిన
41 కాని వెలిసెద త్వరలోనె శ్రీనివాసు
డగుచు, భక్తులు నిను ముందె అరయునట్లు
చేసి కాన్కలిప్పించెద శ్రేష్ఠముగను.

తే॥ ఆ వరాహమూర్తిని వీడి అచటనున్న
42 వకుళమాలను చేరెను వసుధవిభుడు
కట్టు కట్టెను ఆమె ఆ గాయమునకు,
ఆమెతోడనే నివసించ హరిదలంచె.



తే॥ పరమ సంతుష్టి జెందెను వకుళమాల
43 పుత్ర వాత్సల్యమున చూచె భూవిభుడిని
పర్ణశాలను నిర్మించి వకుళ తోడ
శ్రీనివాసుడా యనబడి చేరియుండె.

తే॥ చంద్రవంశమునందున సంభవించె
44 ఆ సుధర్ముడు ప్రజనేలె, అతని సుతులు
జ్యేష్ఠుడాకాశ రాజని చెప్పబడియె
తొండమానుడు తమ్ముడు తోడబుట్టు.

తే॥ తండ్రి తరువాత జ్యేష్ఠుడు ధరణినేలె
45 ధరణిదేవి యాతడి రాణి ధర్మపత్ని
సంతు లేదని వారలు చింతనుండ
శుకుడు ఆతని కడకొచ్చె చూచి అనియె.



తే॥ **దశరథుని రీతి నీవును ధరణినాథ!**
**46** **పుత్రకామేష్టి చేయుము,** పూనె రాజు
క్రతువునందున నాగలి రాజుబట్టె
దానికడ్డాయె పేటియ, దానితీసె.

తే॥ పెట్టెనుండెను అందాలు విరియునట్టి
47 పాప, అంతట ఆకాశవాణి పలికె
రాజ! నీబిడ్డ రీతిగా లక్ష్మివోలె
పెంచు పద్మావతని నీమె పిలువుమయ్య.

తే॥ పూర్వ జన్మలో ఈ బాల పొంద హరిని
48 తపము చేసెను తాను వేదవతి ఆయె
రావణాసురుడామెను లజ్జలేక
బల్మి పొందగ జూచెను వణికె రమణి.



తే॥ హరిని నిందించి నవ్వెడి అసురు జూచి,
49 ఆమె **హరిముందు నీవెంత, అతని కాలి**
**గోటితో తూగబోవన,** కోపగించి
చెరచ బోయెను, ఛీకొట్టి తరుణి అనెను.

తే॥ **నేను దగ్ధమై పోదును నీకు కాను,**
**50** **శాపమిదె గొను నీచ! నీ సర్వమంత**
**నాశనంబయి తీరును నాతివల్ల**
**నాదు ఉసురుతో నీజాతి నాశమగును.**

తే॥ బల్మి అగ్నిలో దూకిన పడతి నపుడు
51 అగ్ని కాపాడి తనకడ ఆదరించె,
ఏళ్ళు గడచిన పిమ్మట హీనుడైన
రావణుడు సీత గొనిపోయె రాక్షసముగ.

తే|| అపుడు దరిజేరి రావణు నగ్నిబలికె
52 ఆమె సీతకాదయ్య ఓ అసుర శ్రేష్ఠ!
మోసపోతివి మాకెల్ల ముఖ్యుడీవు
ఇదియె సీతని ఇచ్చెను వేదవతిని.

తే|| రామ రావణ సంగ్రాన రాక్షసుండు
53 చచ్చినంతనె నిజసీత నిచ్చి అగ్ని
వేడె రాముని పెండ్లాడ వేదవతిని
అనియె ఆయది న్యాయమో అసురవైరి!

తే|| "ఏకపత్నీ వృతుండను ఇపుడు కాదు
54 వచ్చు కలియుగంబందున వనిత! నిన్ను
సతిగ గొందును నామాట సత్యముగను"
అనెను రాముండు ఆనాడు ఆమె తోడ.



తే|| నేడు ఆకాశరాజుకు నెలత దొరికి,
55 పెరిగి పద్మావతయ్యెను విష్ణు కొరకు
హరియె దిగివచ్చె వీడుచు అతని రమను
జరుగు శ్రీనివాసుని పెండ్లి జగతి మురియ.

తే|| ఇచట పద్మావతయ్యెను ఎవరు కనని
56 వినని, అందాల రాసిగా, విద్యలందు
వాణి అనిపించె, అదిచూచి వసుధ జనులు
ఎవని పెండ్లాడునో కదా ఈమె అనిరి.

తే|| నారదుండొచ్చె ఒకనాడు అరయ నామె
57 లక్ష్మిలా శోభ చిందెడి రమణి గాంచి
బాల! నీచేయి జూచెద, వలదు శంక
హరిని పెండ్లాడు దానివో అమ్మనీవు.



తే|| హస్తమును జూచి వాక్రుచ్చె ఆ మునియును
58 అమ్మ! సర్వమంగళవమ్మ! హరికి దగిన
ధర్మపత్నివి, ననునమ్ము ధన్యవమ్మ!
అనుచు బోయెను ఆ మౌని అచటినుండి.

తే|| యుక్త వయసొచ్చె బాలకు యోగ్యుడైన
59 వరుని వెదకుట రాజుకు బాధ్యతయ్యె
రాజపుత్రుల చిత్రముల్ రమణి కొరకు
రాజు తెప్పించె, నచ్చడే రాచబిడ్డ.

తే|| ఒక్కడైనను తూగడు యువతికంచు
60 దిగులు చెందిరి తలిదండ్రి దీనులైరి
వంతజెందెడి రాజుతో పలికె మౌని
నారదుండును ఒకనాడు నగవులొలక.



తే|| ఏల చింతింతువో రాజ! ఇదియె నిజము,
61 ఈమె లక్ష్మికి రూపమౌ ఇలకు దిగిన
వేదవతియీమె, సీతకు బదులు తానె
చెరను పొందెను లంకలో జేరి నాడు.

తే|| రావణుని వధ, పిమ్మట రమణి జూచి
62 పలికె రాముడు ఈ జన్మ 'పత్ని యొకతె'
కలియుగంబున పెండ్లాడగలను నిన్ను
స్వామి పెండ్లాడ యిటకొచ్చె, జనని యీమె.

తే|| హరిని పెండ్లాడు దిగులేల హరియె వచ్చు
63 అనియె ఆశీర్వదించెను, చనియె మౌని,
దాని నెరిగించ రాణియౌ ధరణిదేవి
హర్షమందెను, పులకించిరంత వారు.

తే|| ఒక్క దినమున వకుళతో ఉర్విధవుడు
64 శ్రీనివాసుడు తనకోర్కె చెప్పసాగె
**తల్లి! వేటకై నేగుటకుల్లమందు**
**కోర్కె జనియించె ఆనతి కోరువాడ.**

తే|| వేట వ్యసనము వద్దన్న వినడుగాన,
65 వకుళ జాగ్రత్త చెప్పెను, వల్లె అనుచు
వేట దుస్తులన్ నగలను వేసికొనెను,
విల్లునంబులు గైకొని వేటకేగె.

తే|| బ్రహ్మ ముదమంది మేలైన వారువమును
66 శ్రీనివాసునకిచ్చెను చేరి ప్రభును,
ధనువు టంకారమును విని తల్లడిల్లి
బెదరిచెదరెను మృగములు వేటలోన.



తే|| పులులు సింహాలు పారెను ఎలుగుబంట్లు
67 చేతికందిన వాటిని శ్రీనివాసు
డచట చంపెను, మృగముల నలుపు లేక,
అంతమొందించె నవలీల ఆతడపుడు.

తే|| అశ్వమెక్కిన అతనికి అలుపు లేదు,
68 గజపు ఘీంకారమును విని కడకు దాని
వెంబడించెను, అలసెను, విభుడు తానె
చేరె శృంగారవని నీటి చెలమ కొరకు.

తే|| బాల పద్మావతీదేవి చెలుల గూడి,
69 చేరె శృంగార వనమును, స్త్రీలు ఆడి
పాడి కమ్మగ, అందరు పరవశించ
దప్పిగొను శ్రీనివాసుండు తరుణిగాంచె.



తే|| శ్రీనివాసుడు చూచిన స్త్రీ లలామ
70 సొగసు వర్ణింప గాకుండె, చూడసాగె,
నఖశిఖంబంత చూచిన నళినిధవుడు
ఆమె వివరంబు తెలియనై ఆమెజేరె.

తే|| చెలుల పంపె పద్మావతి, చేరి నిలువ
71 రించమన, వారు చేరి వారించి హరిని
**నీవు ఎవడవు? వనితల నెలవు కొచ్చి**
**ఇట్లు చేసిన శిక్షగు ఎరుక కాదె?**

తే|| వేటగానిది వేషము, వింత నడత,
72 చెప్పసాగెను ఈరీతి **చెలియలార!**
**నేను తలిదండ్రులెరుగను, నెలవులేదు,**
**తొల్లి సిరియుండె నేడది తొలగిపోయె.**



తే|| **తరుణి ఎవ్వారి దానవు ఎరుగ బలుకు,**
73 **ఇంత సౌందర్యమా రతి చెంతగలదె?**
**వాణి, శ్రీదేవి, గిరిజలు వనిత నిన్ను**
**అందచందాల తూగరు ఇందువదన!**

తే|| ఆమె తనగూర్చి చెప్పిన తమ వివరము
74 శ్రీనివాసుడు విని ఇట్లు చెప్పసాగె
**"నిన్ను ప్రేమించు వాడను నిజము దేవి!**
**నన్ను పరిణయమాడుము నమ్మునన్ను."**

తే|| అతని మాటలు విన్నట్టి, ఆమె ఆగ్ర
75 హించి ఇట్లనె **మూర్ఖుడా! ఎరుగవేమి**
**రాకుమారిని కోరెడి నీకు వెర్రి,**
**బోయవానికి నీకేమి పుట్టె నిట్లు?**

తే॥ రాళ్ళతో గొట్టి, ఆ బాల రయమునేగ,
76 రక్తధారలు కార్చుచు రమణుడపుడు,
వీడి శృంగార వనమును వేదనొంది
శ్రీనివాసుడు శేషాద్రి చేరె తుదకు.

తే॥ వకుళ కన్నీరు మున్నీరు వలెను ఆయె
77 సంగతిని విని, **రాజుతో సాధ్యపడదు,**
**పద్మ నొదలుట క్షేమము, బ్రతుక గలము**
అనుచు సరిజెప్పె వినుమని అశ్రువులతొ.

**తే॥ తల్లి! వినుమమ్మ! చెప్పెద, తొల్లి నేను**
**78 రామచంద్రుండ, జానకీ రమణిదాచి**
**అగ్ని వేదవతిని యిచ్చె అసురపతికి**
**ఆమె కోరెను నాభార్య అవుదునంచు.**



**తే॥ కలియుగంబున తనకోర్కె కలుగునంటి,**
**79 నేడు ఆకాశరాజును నెలత జేరె**
**సుతగ, మాపరిణయము నీచేతిమీద**
**జరుగు, వకుళవై పుట్టిన సతి యశోద!**

తే॥ విరహ బాధను తాళక వేదనొంద,
80 పద్మ చెలులతో గూడదు పలుకు లేదు,
తినుట మానిన చెలి వంత తెలియలేక,
చెలులు తలిదండ్రికా మాట చెప్పిరపుడు.

తే॥ రాజదంపతులప్పుడు రమణి జూచి
81 భీతి చెందిరి, వగచిరి బిడ్డ కొరకు,
పూజలభిషేకములతోటి పుత్రిగూర్చి
వేల దేవుళ్ళమొక్కియు ఫలములేదు.



తే॥ శ్రీనివాసుని వేదన కనుట గాక,
82 నిశ్చయించెను వకుళయా నిజము దెలుప
రాజుకడకేగి బ్రతిమాలి రమణి పద్మ
హస్తమును వేడ నేగెను ఆశపడుచు.

తే॥ శ్రీనివాసుడు సోదెమ్మ కనువుయైన
83 వేషధారియై చేరెను వింతగొలుప,
రాణివాసము, కూడిన రమణులకును
చెప్పెదను సోది రమ్మని జేరబిలిచె

తే॥ జరిగినది చెప్పి రమణులు సంతసించ,
84 చెప్పె సోదెమ్మ అతివరో! చింత వలదు
రాజు ఏమన్న నీకేమి, లక్షణముగ
నీకు ఆతడే పతియౌను నిశ్చయముగ.



**తే॥ మనువు జరుగును యెల్లరు, మనము ఎచట**
**85 ఇట్టి పెండ్లిని చూడము ఎన్నడేని,**
**అనుచు జనులెల్ల ఈ పద్మనాదరింతు**
రనుచు సోదెమ్మ వెడలెను అచటనుండి.

తే॥ వకుళ నారాయణ పురము వడిగజేరి,
86 కలిసి ఆకాశరాజును తెలియజెప్పె
శ్రీనివాసుని కథయంత చివరికనెను
**రాజ! లక్ష్మియే నీబిడ్డ నిజము వినుము.**

తే॥ శ్రీనివాసుని గూర్చి నేచెప్పనేల,
87 మన్మథుని మించు అందము మరల గనము
లక్ష్మి లేకున్నదీనాడు రత్నమతడు
నీదు పుత్రిని వరియించ నిశ్చయించె.

తే॥ **దైవమే దిగివచ్చెను తెలియుమయ్య!**
**88** **లక్ష్మి నారాయణులు వారు రాజ! వినుము**
**వారి కళ్యాణమొనరించి వాసిగనుము**
అన్న వకుళతో యోచింతు మమ్మ! అనిరి.

తే॥ తొండమానుని పిల్చెను తుదకు రాజు
89 శుక మహాముని దెమ్మనె శోభతోడ
పద్మవైవాహ లగ్నము వడినిదెల్ప
శ్రీనివాసుని అల్లుని చేయుదమనె.

తే॥ వారి కులగురువై గొప్ప వాసిగనిన
90 శుకుడు, యెతెంచ ఆఋషి శుభములగును,
మునిని తొండ మానుడు చూచి మ్రొక్కితెలుప
వల్లె అనిమౌని రాజును వచ్చి కలిసె.



తే॥ రాజు శుకయోగితో చెప్పె నిజకుమార్తె
91 శ్రీనివాసుల ప్రేమను, మౌని బల్కె
**రాజ! ఏనాటి పుణ్యమో ఈజగతికి**
**పతిని జామాతగా పొందు భాగ్యమయ్యె.**

తే॥ మనసు ఆనందమొందగ ఆ నరపతి,
92 స్వయముగా బృహస్పతి బిల్వబంపె ననుజు
మౌనియేతెంచి రాజును మరల మరల
పొగిడి హరిపెండ్లి శుభలేఖ పూనెవ్రాయ.

తే॥ తగుచు వైశాఖ శుద్ధపు తదియనాడు
93 శుక్రవారము నాటిదౌ శుభముహూర్త
మందు, శ్రీనివాసుని పెండ్లియాడ గలదు
తరుణి పద్మావతంచని ఎరిగె రాజు.



తే॥ శుకుని పిలిపించి ఆ రాజు శుభకరముగ
94 మొదటి శుభలేఖ వరునకు ముందుగానె
బంపె, ఆతడు శేషాద్రి వాసుడైన
వరుని కందించె తనకదే భాగ్యమనుచు.

తే॥ శుకుడు లేఖ తీసుకుపోయి శుభగడియలో
95 శ్రీనివాసునికిచ్చెను చెప్పి శుభము,
అతిథి సత్కారములు చేసి ఆ వకుళయు
మనసు ఆనంద పడు రీతి మునిని కొలిచె.

తే॥ శ్రీనివాసుడు లేఖను స్వీకరించి
96 వ్రాసి లేఖను తనదగు బదులునిచ్చె,
**పెండ్లి వేళకు వచ్చెద ప్రియము నాకు,**
మౌని సంతోషమున వీడె శ్రీనివాసు.



తే॥ నారదుడు వచ్చి ఒకరోజు హరిని గలియ,
97 తనదు వైవాహ విషయము మునికి జెప్పి
పెండ్లి ఖర్చుకుయే సిరి వెంటలేదు,
దారి చూపించమన, నవ్వె నారదుండు.

తే॥ **జగతి పోషించు స్వామికి సాయపడుట**
**98** **మాకు భాగ్యము, ఓ ప్రభూ! నీకు లీల**
**నేటి కలియుగ ధర్మాన నీవుకూడ**
**'అప్పు' చేయుము ధనదుని ఆశ్రయించి**

తే॥ **నీవు కొన్న ధనమునకు నేటినుంచి**
**99** **వడ్డి కట్టిన చాలును వాసుదేవ!**
**నేడు గైకొన్న ధనమును చూడవచ్చు**
**ఎపుడొ తీర్చెదమని** నవ్వె నపుడు మౌని.

తే॥ ఆ కుబేరుడు తన భాగ్యమంచు తలచి,
100 కోటి పద్మాల లక్షలు నాటి ధనము
'రామనిష్కామము' ల గొని రమణుడపుడు
ఋణపు పత్రము వ్రాసిచ్చె ఫణము గొనుచు.

తే॥ శ్రీధరుడుజేయు అప్పుకు శ్రేష్ఠులైన
101 సాక్షి ఒకడయ్యె స్వయముగా శంకరుండె
ధరణి అశ్వత్థ వృక్షము తను ద్వితీయ
సాక్షి అయ్యెను ధనదుండు సంతసించ.

తే॥ శ్రీనివాసుడు వకుళతో చెప్పెనిట్లు
102 జనని! పెండ్లి పిలుపులకు సమయమయ్యె
వేరి పిలువను? అనె ఆమె 'పరులు నీకు
ఎవరు? నీదు పెండ్లిని చూడ ఎవరు రారు'?



తే॥ విశ్వకర్మ యేర్పరచెను విడిది వసతి
103 పెండ్లిపిలుపుకు గరుడుడే పిలువబోయె
పేరు పేరున ముల్లోక చారులతని
పిలుపులందుచు వచ్చిరి బెండ్లి జూడ

తే॥ అగ్ని చూసెను భోజన అవసరములు
104 వస్త్రముల జూడ ధనదుని వంతు ఆయె
వాయుదేవుడు తెచ్చెను పరిమళాలు
పెండ్లి పెత్తనమింద్రుడు పేర్మి జెసె.

తే॥ గానములు జేయ గంధర్వ గాయకులును,
105 నృత్యములు జేయ రంభాది నిపుణులున్ను,
ఆ వసిస్టుడు స్వయముగా అమరెనచట
తానె పౌరోహితంబెంచి ధన్యుడయ్యె.



తే॥ పెండ్లికైనేగు శ్రీహరి వెంటజేరె
106 బ్రహ్మ, శంకర, దేవేంద్ర వరులు ఘనులు
దివ్య సౌగంధములదేలి దేవతలును
పయనమయ్యిరి పెండ్లికి వరునితోడ.

తే॥ వారు వాహనాలను గొని పయనమైరి,
107 మార్గమందున శుకముని మాధవునికి
తాను ఆతిధ్యమిచ్చెను తినెను హరియె,
కాని త్రేన్చిరి అందరు కడుపు నిండి.

తే॥ పయనమయ్యిరి అటునుండి వరుని కూడి
108 స్వాగతము బల్కి ఆరాజు చక్కనైన
విడిది ఏర్పాట్లు చేసెను, కడిగి వరుని
కాళ్ళు, పులకించె తనజన్మ ఘనమనంచు.



తే॥ పెండ్లి జరిగెను, నెలకొన వేదఘోష,
109 పద్మ చేతిని హరికిచ్చి పలికెనిటుల
స్వామి నాబిడ్డ నెన్నడు వదలకయ్య
తప్పు మన్నించి కాయుము ధన్యజేసి.

తే॥ పెండ్లి వధువును చేగొని వెనుదిరిగిన,
110 సంతసించిన దేవతలంత యపుడు
ఎవరిదారిన వారేగ అవనినుండి,
శ్రీనివాస కళ్యాణము సిరులమయము.

తే॥ చేరె నాగస్త్యమునివరు శ్రేష్టమైన
111 ఆశ్రమము హరి భార్యతో, అనెను మౌని
"ఆరునెల్లకాలములోను మీరు నూత్న
దంపతులు కొండలెక్కుట తగదు స్వామి."

తే॥ వాని ఆశ్రమ మందునె వసతినీయ
112 కొత్త దంపతులచ్చోట కూడియుండ
మునులు ఆనంద మందిరి ముగ్ధులైరి
కాలచక్రము తిరుగాడె నెలలు మారె.

తే॥ కొన్ని రోజుల పిమ్మట కూడి వ్యాధి
113 రాజు పంపించె వార్తను, రమ్మనంచు
శ్రీనివాసుడు సతిగొని చేరువరకు
రాజు స్పృహలేక పడియుండె రమణులేడ్వ.

తే॥ కడకు స్పృహ వచ్చి అల్లుని వేడెనతడు,
114 తొండమానుని, వసుధాము కండయగుదు
నంచు హరిబల్కు తృప్తితో నరిగె దివికి
సహగమనమంది రాణియు చనెను తాను



తే॥ తాను రాజౌట తగునని తగవులాడు
115 మామ, బావల జూచిన మాధవుడును
శంఖు చక్రాలు మామకు, స్వయము తానె
బావవైపున పోరిరి వసుధ కొరకు.

తే॥ తాను ఓడించలేదయ్యె తనదు అస్త్ర
116 ములను, సంధి చేసెను హరి ముదమునంద
పంచి సమముగ రాజ్యము వారికిచ్చె
సంతసించిరి కొలిచిరి సమ్మతించి.

తే॥ తరలి మునికడ నివసించు తనను జూడ
117 వచ్చు తొండమానుని తోడ పలికె హరియు
శేషగిరి పైన నెలకొందు శ్రేష్ఠ మదియె
నాకు ఆలయమును గట్ట నయము రాజ!



తే॥ చూపె తొండమానునికొక శుభ దినాన,
118 ఆ వరాహమూర్తిచ్చిన ఆ స్థలమును
అందు నిర్మించె నారాజు అద్భుతమగు
నెలవు స్వామికి నెలకొన నియతి తోడ.

తే॥ భువికి దిగివచ్చి దేవతల్ పూని హరిని
119 వేయి నోళ్ళతొ కొనియాడ విభుడు సతితొ
ఆలయము జేరి నివసించ, అందరున్ను
దాని ఆనందనిలయము అనిరి కూడి.

తే॥ బ్రహ్మ జరిపిన ఉత్సవ వరుస గనుక
120 దాని బ్రహ్మోత్సవంబని అనగనగును
వివిధ వాహనా లెక్కుచు వీధులందు
స్వామి తొమ్మిది దినముల జనును వేడ్క.



తే॥ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి అంకురార్ప
121 ణముతొ మొదలగు వేడుకల్ స్వామిగొల్చి
వేంకటేశ్వరుడంచని వేడు కొనిన,
ఈప్సితమ్ములు తీర్చెడి ఇంటి వేల్పు.

తే॥ విష్ణు ధ్యాసతొ శ్రీలక్ష్మి విభుని గూర్చి
122 ధరణి కొల్హాపురంబున తపమునుండ
నారదుండొచ్చి సంగతి ఎరుక పరచి
తనదు విభుజేరి ఆయమ్మ తగవులాడె

తే॥ ఎట్టకేలకు లక్ష్మిని ఇష్టపరచి
123 పద్మనొప్పించ ఎట్టులో వల్లె అనగ
సవతులిద్దరి గలిపెను చక్కనైన
విధిని కొన్నాళ్ళు సుఖముండె విభుడు తానె.

తే॥ మూడునాళ్ళగు సవతుల ముచ్చటెల్ల,
124 సవతి కలహము తలనొప్పి దైవమైన
తీర్చలేకుండు, ఆవిధి తీవ్రమైన
పోరు నాపగ లక్ష్మికి బోధపరచె.

తే॥ సీత హరణ రావణుడంత చేయనెంచ
125 అగ్ని వేదవతిని బంపె నామె బదులు
లంక గడగండ్లు పొందిన రమణి బెండ్లి
ఆడుమని వేడు సీతతో అనె రఘుపతి.

తే॥ ఏకపత్నీ వ్రతుండను ఇపుడు గాన
126 కలియుగంబున ఈమెను వలపు మీర
పెండ్లి యాడెద తిరిగి ఈ వేదవతిని
శ్రీనివాసుని రూపాన చెలిమిమీర.



తే॥ నిజము తెలిసిన లక్ష్మికి నెనరు కలుగ
127 వెంకటేశుడు ఈ విధి వివరమిచ్చె
**దేవి! కలియుగాంతము దాక నీవు ప్రజకు**
**సిరుల నిచ్చిన, గొలువ నన్ చేరగలరు.**

**తే॥ వారి కాసులచే వడ్డి తీరగలదు**
128 కలియుగాంతములో తీరగలదు 'అప్పు'
ఆ కుబేరుని అప్పుకు అసలుదీర్చి,
మనము వైకుంఠపురి జేరి మనగనగును.

తే॥ వెలసె శ్రీలక్ష్మి శుకముని నెలవులోన
129 కలుగు పద్మసరోవర సలిలమందు,
విశ్వకర్మయె దానిని వెలయ జేసె
సిరుల నిచ్చెను ఆయమ్మ కోరు ప్రజకు.



తే॥ వెలసె పద్మావతీదేవి విభుని యాన
130 తానె అలిమేలుమంగయై జనులగావ,
శేషశైలము దిగివచ్చు శ్రీరమణుడె
దేవిగూడగ ప్రతిరోజు దిగును గిరులు

తే॥ తొండమానుడు వెలయించె తొల్లి తానె
131 ఆలయంబును శేషాద్రి నతిశయముగ
శ్రీనివాసుడు అందునే శిలగమారి
వెలసె, భక్తితో ఆ రాజు విభుని కొలిచె.

తే॥ తిరుమలనబడె శేషాద్రి వరుసనున్న
132 ఏడుకొండలు శ్రమకోర్చి ఎక్కివాని
ఆపదల మొక్కు వారల నాదుకొనును
వడ్డి గుంజెడి ఆ స్వామి వదలకుండు.



తే॥ చివరి కొకమాట నమ్ముడు చేరి వినుడు,
133 రత్నరాసుల గొల్చిన, రాదు, ముక్తి
కోర్కె తీరిన మరియొక కోర్కె బుట్టు
మొక్కుబడి హెచ్చు జనులార! మోక్షమేది?

## మంగళం

తే॥ మంగళము కోసలేంద్రుకు మహిమకల్గు
గుణములాకారమొందుచు కూడియున్న
చక్రవర్తికి పుత్రుడౌ సజ్జనునకు
మంగళము సార్వభౌముకు మంగళంబు

## అంకితం

తే॥ పూర్తి చేస్తిని శ్రీరామ పుణ్యమంత
నీదె, కాకున్న ఓ ప్రభూ! నేను యెంత?
తమరి కళ్యాణ కాన్కగా ధన్యు జేసి
అవని సుతతోటి గొనుమయ్య 'అంకితమును'.